# ఖైదీ

## సీరియల్

టకటకమంటూ బూట్ల చప్పుడయింది.

ఎవరో సెల్యూట్ చేసినట్లు, బూటు నేలకేసి 'టప్'మని కొట్టిన శబ్దమైంది.

"ఖైదీ ఏంచేస్తున్నాడు" అడిగారెవరో.

"ఇంకా స్పృహవచ్చినట్లు లేదుసార్!" చెప్పింది కానిస్టేబుల్ లాగుంది.

నాకంతకుముందే స్పృహవచ్చింది. నేలమీద బోరగిలా పడివున్నాను. సిమెంటుతో చేసిన గచ్చు నా మొఖానికీ, అరచేతులకు చల్లగా తగులుతూంది.

కళ్ళు తెరిచేందుకు ప్రయత్నించాను. కానీ లాభంలేక పోయింది. తెరవబోతే రెప్పలు విడివడలేదు. కణతలు పగులుతున్నాయి. తల దిమ్ముగావుంది. కాళ్ళు నిస్సత్తువగా వున్నాయి.

గది తలుపులకున్న గొళ్ళెంలాగిన శబ్దమైంది.

ఎవరో తలుపు తెరుస్తున్నారనుకున్నాను. మరు నిము

పంలో కిర్రుమంటూ శబ్దమైంది. అంటే తలుపు తెరిచారను కున్నాను.

"ఖైదీ! ఖైదీ!!" పిలుస్తూ, నా కాళ్ళను బూటుకాలితో తంతున్నారెవరో. పలకాలనుకున్నాను. నోరు పెగిలి మాట రాలేదు.

అతను మళ్ళీ పిలిచాడు.

మళ్ళీ బదులు చెపుదామని ప్రయత్నించాను. లాభంలేక పోయింది.

"సార్! ఇంకా స్పృహరాలేదు సార్," అన్నాడు జవాను.

"ఇరవై నాలుగు గంటలనుండి అతనలాగే పడున్నాడు. ప్రాణం వుందో, లేదో చూడండి! ఈ నాలుగు గోడలమధ్య ఛస్తే మనప్రాణానికొస్తుంది!" హెచ్చరించాడు హుందాగా.

మళ్ళీ ఎవరో నా దగ్గరకు వస్తున్న కాలి బూట్లశబ్దమైంది. అతనువచ్చి నా ముక్కుదగ్గర అరచెయ్యి పెట్టాడు.

"గాలి పీలుస్తున్నాడు సార్!!' అరచాడు ఆనందంగా.

"కాసిని చల్లనీళ్ళు తెచ్చి మొహంమీద చల్లు," దూరం నుండి వినిపించిందెవరిదో హుకుం. అతను ఇన్స్పెక్టరయి వుంటాడనుకున్నాను. అందరి మాటలు నాకు వినబడు తున్నాయి. కానీ కళ్ళు తెరవలేకపోతున్నాను. కాళ్ళు కదలించలేకపోతున్నాను. ఎక్కడి కీళ్ళు అక్కడ విరిగి పోయినట్లున్నాయి.

మొఖంమీద చల్లగా తగిలింది. అతనెవరో విసురుగా గ్లాసుడు నీళ్లు నాపైన చల్లాడు. దాంతో చర్మంలోనుండి ఆవిరి పైకి తన్నుకొచ్చింది. కనుగుడ్లు మండాయి. మరు నిము

వంలో రెప్పలు కదిలాయి. కళ్లు తెరిపిడి పడ్డాయి.

"లేవోయ్! లే!" వీపుమీద ఎవరో కొట్టారు.

కాళ్లు, చేతులు అతికష్టంమీద కదలించాను. గుండె నిండా గాలి పీల్చుకుని వదిలాను. దెబ్బతో కొత్తశక్తి వచ్చినట్లయింది. మోకాళ్లు నేలకానించి, అరచేతుల్తో భూమిని అదిమిపెట్టి పైకిలేచాను. విచిత్రం? నేను లేవగలిగాను.

"సార్! లేచాడు సార్! ఖైదీ పైకిలేచాడు!!" నా కెదురుగా వున్న జవాను ఆనందంతో అరుపులు పెట్టాడు.

నా పేరు వాళ్ళకు తెలిసినట్లులేదు. అందుకే 'ఖైదీ' అంటున్నారనుకున్నాను.

బూట్లు చప్పుడు చేసుకుంటూ మరెవరో రావటం గమనించాను.

నన్ను సాయంపెట్టి పైకిలేపి భుజాలమీద వేసుకుని, లాకప్ రూంలోంచి ముందున్న ఆఫీస్ గదిలోకి లాక్కొచ్చారు. ఒక కుర్చీలో మెల్లగా కూర్చోపెట్టారు.

వేడి కాఫీకప్పు నా ముందుంచారు. ఒక్క గ్రుక్క త్రాగాను. అమృతం త్రాగినట్లుంది. వడివడిగా కప్పుకాఫీ ఖాళీచేశాను.

నాలో క్రొత్త చైతన్యం పుంజుకుంది. నీరసం తగ్గింది.

"నీ పేరేమిటి?" అడిగాడు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్.

"రాజా" చెప్పాను.

"మీ గాంగులో మొత్తం ఎంతమందున్నారు?"

"తెలీదు!"

"మీ నాయకుడెవరో తెలుసా?"

"తెలీదు!"

"మీ స్థావరం ఎక్కడ?"

తెలీదన్నట్లు తలూపాను.

"అడిగిందానికి తెలీదంటూ చెపితే ప్రయోజనంలేదు. నీకన్నీ తెలుసు. మాకు నువ్వు ఖైదీగా చిక్కావ్! నీచేత నిజం కక్కించేందుకు నానాహింసలు పెడతాం. ఇప్పుడు గాకున్నా అప్పుడయినా చెప్పాలి! ఆ బాధలను భరిస్తూ చెప్పేకన్నా ముందే చెప్పడం మంచిది!" హితబోధ చేశాడు హిప్పీలా పెంచిన జుట్టు ఎడంచేత్తో సర్దుకుంటూ ఇన్‌స్పెక్టర్.

"నన్ను చంపినా ఆ వివరాలు దొరకవు. కారణం, నాకూ తెలీవు."

ఆమాట వినగానే ఎదురుగావున్న ఇన్‌స్పెక్టర్‌కు నాపై కోపం ముంచుకొచ్చింది లాగుంది. టేబుల్‌పైనున్న లాఠీతీసి తలపైన బాదాడు.

"అమ్మో!" అని అరిచాను.

చట్టం నాకూ తెలుసు. యం. ఏ. దాకా చదువుకున్నాను. ఉద్యోగం చిక్కక, కడుపునిండక, అల్లాడుతున్న రోజుల్లో, నాకా గ్యాంగ్ తటస్థపడింది. వాళ్ళల్లో ఒకడిగా వుండి చెప్పిన పనిచేస్తే బాగా ముట్టజెపుతామన్నారు. సరే నన్నాను.

వాళ్ళదో పెద్దరాకెట్. స్వంతంగా రెండు మోటారు బోట్లున్నాయి. కావలసినన్ని ఆయుధాలు, వాటికి సరిపడ్డ అమ్యూనిషన్, రెండు రహస్య భూగృహాలు, నలభైమందికి పైగా మెంబర్లూ వున్నారు.

వారం వారం సరుకు వస్తుంది. ఈలోగా సేకరించిన గంజాయి, నల్లమందు, వగైరాలు మోటారు బోట్లలో పట్టుకెళ్ళి సముద్రతీరంలో లంగరు వేసిన స్టీమర్‌కు అందిస్తారు. అక్కడ్నుంచి బంగారు, వాచీలు, టేప్‌రికార్డర్లు మొదలైన

రకరకాల సరుకులు తీసుకొస్తారు. వాటిని మా అందరికీ పంచుతారు. దేశంనిండా ఖాతాలున్నాయి.

వారంలోగా సరకంతా అమ్మివేయ్యాలి. ఆ డబ్బుతో గంజాయిలాంటివి కొనుక్కురావాలి.

ఈ ముఠాలో నేను చేరి రెండేళ్ళయింది. దర్జాగా బ్రతుకుతున్నాను. బొంబాయినుండి కాశ్మీరుకు విమానంలో వంద సార్లు వెళ్ళాను. పారడైజ్ హోటల్లో రోజుకు వంద రూపాయలద్దెయిచ్చి ఎన్నో రోజులున్నాను. ఫారిన్ సిగరెట్లు త్రాగుతున్నాను. ఫారెన్ సూట్లు వేస్తున్నాను.

నా శరీరం, అందులో ప్రవహించే రక్తం మాత్రమే ఇండియావి. దాన్ని కాపాడేవి, అలంకరించేవి మొత్తం ఫారిన్ వే.

అంతకుముందు రోజు శాంతక్రజ్ లో విమానంలోనుండి వచ్చి దిగాను.

పాసెంజర్ లాంజ్ లో అడుగుపెడుతూండగానే ఎక్సైజు వాళ్లు నా లగేజి సోదా చెయ్యాలన్నారు. ఇలా ఎప్పుడూ జరుగలేదు. జరుగనిస్తే నన్ను జైల్లోవేస్తారు. రివాల్వరు గుండ్లతో కాల్చుకుంటూనైనా నేను వెలుపలికి వెళ్ళాలి. తప్పించుకోవాలి.

హిప్ పాకెట్ లో వుంది ఆయుధం. చెయ్యి వెనక్కి పెట్టాను.

వాళ్లు అసాధ్యులైనారు. నా ప్రయత్నం కనిపెట్టారు.

“చేతులెత్తు!” అరచాడు ఇన్ స్పెక్టర్. అతని చేతిలోని రైఫిల్ మెరిసింది. నా ప్రయత్నం మానుకున్నాను.

మరొక జవానొచ్చి చేతులకు బేడీలు తగిలించాడు. ఫైట్ కోసం ఎదురుచూస్తున్న జనం మా చుట్టూ గుమి

గూడారు. అందులో అందమైన ఆడవాళ్లుకూడా వున్నారు.

వాళ్ళందరి ముందు బేడీలు తగిలించిన చేతుల్ని చూసు కుంటే అవమానం, కోపం, అసహ్యం కలిగాయి నాకు నామైనే.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ముందు నడిచాడు. నేను అతని వెంటబడ్డాను. నా వెనుక నలుగురు జవాన్లు వున్నారు. టెర్మి నల్ బిల్డింగ్ దాటేలోగా వాళ్ళను తప్పించుకోవాలని తీర్మా నించుకున్నాను.

"బాత్‌రూం ప్లీజ్!" అన్నాను.

"అర్జెంటా!" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

అవునన్నట్లు తలూపాను.

బాత్‌రూం చూపించారు.

నేను వెళ్ళాను లోనికి. మిగిలిన వాళ్ళంతా తలుపతే వున్నారు. నా చేతులకు బేడీలు వుండటంతో బటన్స్ విప్పు కోవటం చేతకాలేదు.

తలుపు దగ్గరకొచ్చి ఒకతన్ని లోనికి పంపమన్నాను.

ఇన్‌స్పెక్టర్‌కు నా సమస్య అర్థమయింది. ఒక జవానుని వెళ్ళమని సంజ్ఞ జేశాడు. అతను లోనికొచ్చాడు.

కాలితో తలుపునుమూసి తన్ని పెట్టాను. పాంటు బటన్లు విప్పేందుకు నా ముందు వంగాడు జవాను. అంతకుముందు అతని రైఫిల్ క్రింద పెట్టాడు.

వంగిన అతని తలమీద బేడీలతోవున్న రెండు చేతుల్ని పైకెత్తి శరీరంలోవున్న శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకుని, బలంగా నెత్తిమీద మోదాను. "అమ్మో" అంటూ తూలి పడ్డాడు నా కాళ్ళపైన.

వెంటనే కాళ్ళతో చావదన్నాను. అతికష్టంమీద బాత్‌రూం లోపల గడియపెట్టాను. వంగి కూర్చుని రైఫిల్ అందుకున్నాను.

చుట్టూ గమనించాను. వెలుపలికి వెళ్ళేందుకు వేరేదారి లేదు.

లోనికొచ్చిన డోర్‌గుండానే బయటకుపోవాలి, బయట నాకోసం సిద్ధంగా వున్నారు ఎక్సైజ్ స్టాఫ్ ఆయుధాల్తో.

తొందర పడ్డాననిపించింది.

ఖైదీగా వాళ్ళకు చిక్కకూడదన్న ఆరాటంలో అలా చేశానే తప్ప, ఆ తర్వాత తప్పించుకునే మార్గమేమీ లేనందుకు, కోపంతోపాటు భయంగూడా పుట్టుకొచ్చింది.

లెట్రిన్ తలుపు తీశాను. వెనుకవేపు వెంటిలేటర్ వుంది. దానికి అద్దంలేదు. కమ్ములుగూడా లేవు. దూకి వెలుపలకు వెళ్ళొచ్చు. కానీ చేతులకు బేడీలున్నాయి. ఎంతో ప్రయత్నించాను. పట్టుదొరకలేదు.

వెలుపల తలుపు తడుతున్నారు. అరుస్తున్నారు. పిలుస్తున్నారు. వాళ్ళ జవాన్‌ని పేరుపెట్టి పెద్దగా పిలుస్తున్నారు.

నా ప్రయత్నం ఎక్కువైంది. చేతులుపైకి లేవడంలేదు. వెంటిలేటరు అంచును అందుకో గలిగితే సునాయాసంగా నేను వెలుపలకు దూకిపోగలను. అదే సాధ్యం గావడంలేదు.

తలుపులు బాదుతున్నారు.

రెండు నిముషాల్లో లోపలికి వచ్చేశారు తలుపులు విరగగొట్టుకుని. క్రింద అచేతనంగా పడున్న జవాన్‌ని చూడగానే వాళ్ళలో కోపం కట్టలు తెంచుకున్నట్లుంది.

ఒక్క ఉదుటున లెట్రిన్ వైపొచ్చిన నన్ను లాగారు. నలుగురు లాఠీలతో చితకబాదారు. అరచే ఓపికకూడా

పోయింది. తలమీద బలమైన దెబ్బతగిలింది. కళ్లు బైర్లు కమ్మాయి. చిక్కటి చీకటి పేరుకుంది.

అంతే! ఆ తర్వాత ఏమయిందీ నాకు తెలీదు.

"నీ దగ్గరున్న బ్రాండ్ కేస్‌లో గంజాయివుంది. దాని ఖరీదు ఐదులక్షల రూపాయలుంటుంది. ఎక్కడ్నుంచి తెచ్చావ్?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"నాకు తెలీదు!"

"అడిగిన ప్రతిప్రశ్నకు జవాబు తెలీదంటూ బుకాయించి ప్రయోజనంలేదు. నీకు తిండిలేకుండా మాడుస్తాను. నిజం చెప్పిందాకా లాకప్‌లో వుంచుతాను."

"అది చట్టవిరుద్ధం! నామీద కేసు రిజిస్టరుచేసి, కోర్టులో నన్ను హాజరుపరచండి" అన్నాను నేను కనీసం వీళ్ళదగ్గర తన్నులు తినడం తప్పుతుందన్న ఆశతో.

"చట్టం నాకూ తెలుసు. నీమీద కేసు రిజిస్టరు చెయ్యను. నీ గ్యాంగ్ వివరాలు వాళ్ళెక్కడున్నదీ అంతా చెప్పాక, ఆ తర్వాత నిన్ను అత్తగారింటికి పంపే ఏర్పాటుచేస్తాను," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

నాకు నోటమాటరాలేదు. నన్ను మళ్ళీ లాకప్ రూంలో నెట్టి తాళాలేశారు.

బాగా ఆకలవుతూంది. సిగరెట్ త్రాగాలనిపిస్తోంది. మామూలు పోలీసులకన్నా ఎక్సైజ్ వాళ్లు అన్యాయం. నన్ను అన్నంపెట్టకుండా మాడ్చి చంపుదామనుకుంటున్నారు లాగుంది.

హోటల్ ప్యారడైజ్ కళ్ళముందు మెదిలింది. నేను మామూలుగా దిగే రూం గుర్తుకొచ్చింది.

ఆ రూంకోసం వాళ్ళతో అల్లరిపెట్టుకునే వాణ్ణి. అక్కడ్నుంచి డాల్ లేక, దాని వెనుకనున్న సుందరమైన ఉద్యాన వనాలు కన్పిస్తాయి. సాయంత్రం వేళల్లో వరండాల్లో బాస్కెట్ ఛెయిర్ వేసుకుని, విస్కీసీసాముందు పెట్టుకుని, త్రాగుతూ, ఆ సీనరీచూస్తూ ఆనందించే వాణ్ణి.

ఆ హోటల్‌లో ఎంతమందో అందమైన అమ్మాయిలున్నారు. రేటు ఎక్కువ. అయినా ఆనందం అందిస్తారు. ఆపిల్ పళ్ళలాగుంటారు. వాళ్ళ రంగు, యవ్వనంపొంగు, నాకెంతో ఇష్టం.

జీవితాంతం అలా గడిచిపోతే బాగుండు ననిపించేది. ఇంత త్వరగా నేను వీళ్ళచేతుల్లో పడిపోతాననుకోలేదు.

మూడువేపులా కిటికీలులేని రాతిగోడలు, నాలుగోవైపు లావుపాటి ఇనుప కమ్ములతో తయారుచేసిన తలుపు, దానికి తగిలించిన రెండు కిలోల బరువున్న లాక్, దాని వెనుక అస్తమానమూ పహరా తిరుగుతున్న జవాన్లు. మధ్య నేను ఖైదీగా ఆకలితో చచ్చిపోతానేమోనని భయంవేసింది.

నేను చావగూడదు.

జీవించాలి! ఆనందం జుర్రుకోవాలి. మళ్ళీ ప్యారడైజ్ హోటల్, విస్కీ బాటిల్, లక్కీ స్ట్రైక్ సిగరెట్, కాశ్మీర్ అమ్మాయిల యవ్వనం, అన్నీ గుర్తొచ్చాయి. నా కవన్నీ కావాలనిపించింది.

ఆలోచించసాగాను అక్కడ్నుంచి తప్పుకునే మార్గం కోసం. మెదడు వేడెక్కింది.

గ్యాంగ్ వాళ్లు గుర్తొచ్చారు. నిన్న తనకోసం ఎదురు చూసుంటారు. అందరూ హెడ్‌క్వార్టర్సుకు తిరిగివస్తారు.

తెచ్చిన సరకంతా పాక్ చేసుకుని, ఈ రాత్రికి 'జూహూ'
బీచికి రెండు మైళ్ల క్రింద చేరతారు. అక్కడ చెట్లల్లో దాచి
వుంచిన మోటారు బోట్లను సముద్రంలోకి తోసుకొనిపోయి
మూడు మైళ్ళ దూరంలో ఆగివున్న స్టీమరు దగ్గరకు వెళ్తారు.
క్రొత్త సరుకు అందుకుంటారు. మళ్ళా రేపు ఎవరి ఊళ్ళకు
వాళ్లు వెళ్ళిపోతారు.

నా కోసం వాళ్లు వెతుకుతారా? ఏమో?

నేను గ్యాంగ్ లో కలిశాక, నాలా ఎవ్వరూ పట్టుబడ
లేదు.

పట్టుబడ్డ వాళ్ళెవరూ గ్యాంగ్ రహస్యాలు చెప్పకూడ
దనీ, చావుకూడా సిద్ధపడాలనీ నియమముంది.

ఖైదులోంచి తప్పించేందుకు గ్యాంగ్ ప్రయత్నం చేస్తుందని
విన్నాడు. నన్నుగూడా వాళ్ళొచ్చి రక్షిస్తే బాగుండు నని
పించింది.

అలా ఆలోచించుకుంటూనే నిద్రపోయాను.

మళ్ళీ కళ్లు తెరిచేసరికి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎవర్నో
తంతున్నాడు.

ఎవరాని లేచి చూశాను. ఆరడుగుల ఆజానుబాహు
విగ్రహం. దుబ్బు మీసాలు. గిరిజాల జుట్టు.

అతన్నెక్కడో చూచిన గుర్తువచ్చింది. తలుపు దగ్గరగా
వెళ్ళి నిలబడ్డాను. అతనికేసి నిశితంగా చూశాను.

"జేమ్స్!" పెద్దగా అరవబోయి తమాయించుకున్నాను.
వీడెందుకిక్కడికి వచ్చాడన్న అనుమానమేసింది.

వీడ్ని నాకు బాగా తెలుసు. మా సరుకంతా దాచివుంచిన
భూగృహానికి కాపలా కాస్తుంటాడు. నేనంటే చాలా ఇష్టం

వీడికి. నా దగ్గర డబ్బులు, సిగరెట్లు, విస్కీ సీసాలు తీసు కొంటూ వుంటాడు.

జేమ్స్‌ను కాళ్ళతో, చేతుల్తో, లాఠీలతో తన్నారు అందరూ.

వాడు క్రిందపడ్డాడు. పైకి లేవనెత్తి కొట్టారు. నోరువిప్పి ఒక్క మాట చెప్పలేదు.

లాకప్ రూం తలుపులు తెరచారు. జేమ్స్‌ని లోనికి నెట్టి తలుపు బిగించారు. వాడు వచ్చి నాకు దూరంగా గోడ వారగా కూలబడ్డాడు.

పలకరిద్దామని అటు కేసి తిరిగాను.

నన్ను తెలీనట్లు తల త్రిప్పుకున్నాడు.

వాడలా ఎందుకు జేశాడో నాకు అర్థంగాలేదు. వాడు కూడా బోరగింతలా పడుకున్నాడు. నాకేం చెయ్యాలో తోచలేదు.

నేను గూడా కళ్ళుమూసుకున్నాను.

ఏదో కారొచ్చి ఆగిన శబ్దమైంది.

కదలకుండా పడుకునేవున్నాను.

"ఖైదీ ఏమయినా సమాచారం చెప్పాడా?" వచ్చినతను అడిగాడు.

"లేదుసార్! లాఠీలు విరిగాయి. చేతులు నొప్పిపుట్టాయి. వాడుమాత్రం నోరువిప్పి మాట్లాడలేదు," ఆమాటలు అన్నది ఇన్‌స్పెక్టర్ అని సులభంగానే తెలిసింది.

"ఈ గ్యాంగ్స్‌లో మంచి ట్రయినింగ్ ఇస్తారు. వాళ్ళు చావుకు సిద్ధపడతారుగానీ, నిజం చెప్పరు. ఖైదీ ఇప్పుడేం చేస్తున్నాడు?"

"నిద్రపోతున్నాడు సార్!"

ఇన్‌స్పెక్టర్ మాట అబద్ధం కావటం నాకు ఇష్టంలేదు. వెంటనే కళ్ళుమూసుకున్నాను.

"మనం పైఎత్తు వెయ్యాలి. ఖైదీ తప్పించుకునిపోయే అవకాశం కల్పించాలి. అతను తప్పుకోగానే మనం అతన్ని నీడలా వెంటాడాలి. అతనెటూ వాళ్ళ ముఠాను వెతుక్కుంటూ తన స్థావరానికి వెళ్తాడుగా! మనం వెంట వెళ్ళవచ్చు. అందర్నీ పట్టుకోవచ్చు. వాట్ డూ యూ సే!" అడిగాడు వచ్చిన ఆగంతకుడు.

నా ఉత్సాహం కలిగింది. ఈ నాలుగు గోడలనుండి వెలుపలకు పోయే అవకాశం వాళ్ళే కల్పించబోతున్నందుకు నా అదృష్టం తలచుకుని ఆనందించాను. ఆ ఇన్‌స్పెక్టరు ఏమంటాడో విందామని చెవులు రిక్కించాను.

"మంచి ప్లానే! కానీ వాళ్ళు అసాధ్యులు సార్! మన నుండి తప్పుకున్నాక, మనం వెంటాడగలిగే విధంగా వాడు వెళ్తాడని నా అనుమానం."

"డోంట్ బీ ఎ పెసిమిస్ట్. వీణ్ణి పట్టుకొన్నందువల్ల మనకు ఒరిగేది ఏమీలేదు. పెద్దచేపలు కావాలి."

"అలాగే సార్!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"గుడ్! ముందు నీ ఏర్పాట్లు పూర్తిచేసుకుని ఆ తర్వాత అతనికి అవకాశం కల్పించు. మనం కావాలనే అతనికి తప్పించుకునే అవకాశం ఇచ్చినట్లు అతనికి అనుమానం కలగకూడదు," అన్నాడతను.

"అలాగే బాస్!" అన్న ఇన్‌స్పెక్టర్ మాటలు, ఆ తర్వాత రెండు నిముషాలకు కారుకదలి వెళ్ళిపోయిన శబ్దం వినవచ్చింది.

ఇన్‌స్పెక్టర్ ఫోన్లు చెయ్యడం ప్రారంభించాడు. ఎవ

రవరితోనో ఏమేమో మాట్లాడసాగాడు. అవన్నీ బహుశా నేను తప్పించుకున్నాక పట్టుకునేందుకు చేస్తున్న ఏర్పాట్లయి ఉండాలనుకున్నాను.

చీకటి పడింది.

ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోయాడు. జవాన్లుకూడా స్టేషన్ బయటున్నట్లున్నారు. గదిలో నేనూ, జేమ్స్ వున్నాం. వాణ్ణి మా బాస్ పంపివుండాలనిపించింది. నన్ను రక్షించేందుకు వాళ్ళేం పథకం వేశారో తెలుసుకుందామనుకున్నాను.

మెల్లగా దొర్లుకుంటూ జేమ్స్ దగ్గరగా వెళ్ళాను.

"జేమ్స్!" అన్నాను.

వాడు కదిలాడు. నావైపు తిరిగి కళ్ళు తెరచాడు.

"చిక్కావా?"

"నీకోసం చిక్కబడ్డాను."

"ఎందుకు?"

"ఇక్కడ్నుంచి తప్పించేందుకు."

"బాస్ పంపాడా?"

"ఆఁ!"

"ఎలా తప్పిస్తావ్?" ఆత్రంగా అడిగాను.

వాడు నాదగ్గరకంటూ వచ్చాడు.

"నాదగ్గర రెండుమాత్రలున్నాయి. అవి వేసుకుంటే చచ్చినట్లు, చలనంలేకుండా ఉండిపోతాం. మన మీద కేసులు రిజిస్టరు చెయ్యలేదు. లాకప్‌లో ఉండగా ఖైదీలు చనిపోతే బాధ్యత వీళ్ళదవుతుంది. ఉద్యోగాలు పోతాయి. మనం చచ్చామనుకుని శ్మశానంలో పారేస్తారు. అక్కడ్నుంచి మనవాళ్ళు తప్పిస్తారు!" అన్నాడు జేమ్స్.

బాస్ తెలివికి ఆశ్చర్యపోయాను.

కాని నాకు అనుమానం వచ్చింది. వీళ్లు మమ్మల్ని ఏ శ్మశానానికి తీసుకుపోతారో వాళ్ళ కలా తెలుస్తుంది. పూడ్చివేశాక, గాలి ఆడక చచ్చే అవకాశముంది. నా అను మానం వ్యక్తంచేశాను. జేమ్స్ నవ్వాడు.

"ఇది సముద్రం ఒడ్డునేవుంది. వెనుకే పూడ్చిపెడతారు. ఎక్కువదూరం తీసుకుపోరు. ఎవరన్నా చూస్తే మాటొ స్తుంది. మనవాళ్ళు బోటులో సిద్ధంగా వుంటామన్నారు" చెప్పాడు జేమ్స్.

"ఇందాక వచ్చినాయన చెప్పింది విన్నావా?"

"ఆఁ!"

"వాళ్ళే అవకాశం ఇస్తుంటే మళ్ళీ ఈ మాత్రలెందుకు."

"ఇది బాస్ ఆర్డరు."

"బాస్‌కు ఇక్కడి విషయాలు బహుశా తెలిసుండవు. అందుకనే అలా చెప్పి పంపాడు."

"నీచేత ఈ మాత్ర మింగించమన్నాడు బాస్. నన్ను కూడా మింగమని చెప్పాడు. ఆయన చెప్పినట్లు చెయ్య కుంటే మనప్రాణాలు పోతాయి," అన్నాడు జేమ్స్.

నేనేం మాట్లాడలేదు. ఎంత సర్ది చెప్పుకున్నా బాస్ వేసిన పథకంలో నాకు చాలా లోట్లు కనుపించాయి. నాకై నేను తప్పించుకుని వెళ్ళడంవేరు. శవంలా మారిపోయి వాళ్లు బైటపారేస్తే బాస్ వచ్చి రక్షించడంవేరు.

జేమ్స్ ఉత్త మొద్దువెధవ. చెప్పింది చెయ్యడం తప్ప మంచిచెడ్డ లాలోచించే బ్రెయిన్ లేదు వాడికి.

నాకు మరో అనుమానంకూడా వచ్చింది.

వాళ్ళ రహస్యాలు చెప్పివుంటానన్న భయంతో జేమ్స్ ద్వారా తప్పించే సాకుతో విషంపెట్టి చంపేందుకు బాస్

నిర్ణయించాదేమోననీ.

ఈ గ్యాంగ్స్‌లో ప్రాణాలకు పెద్ద విలువలేదు. నేను పోతే నాలాంటివాడింకొకడు దొరుకుతాడు వాళ్ళకు.

ఏమయినా జేమ్స్ తెచ్చిన మాత్రలు వేసుకోకూడదని నిర్ణయించుకున్నాను.

"మాత్ర ఇచ్చేదా?" అడిగాడు జేమ్స్.

"ఇవ్వు!" అన్నాను.

తోలుబెల్టుకున్న చిన్న పర్సులాంటిది తెరిచి అందులోనుండి తెల్లటి మాత్రతీసి అందించి, "వేసుకో!" అన్నాడు.

మాత్ర అందుకున్నాను.

"నీదేది?" అడిగాను.

మరొకబిళ్ళ చూపించాడు.

"వేసుకో!" అన్నాను.

"నువ్వు?"

"నీళ్ళులేంది మింగలేను. ఎవడైనా జవాన్ వస్తే నీళ్ళు తెప్పించుకుని మింగుతాను. నువ్వు మింగెయ్యి!" అన్నాను.

నాకున్న అనుమానాలు జేమ్స్‌కి లేనట్లుంది. నోరు తెరచి మాత్రవేసుకొని మింగాడు. గుండెపైన చేత్తో రాసుకున్నాడు.

నిముషంలోనే ఉండచుట్టుకుని గిలగిల కొట్టుకుని పడిపోయాడు. నోటిగుండా నురుగొచ్చింది.

నా పర్సు చేత్తో వాడినోరు తుడిచి వాసన చూసుకున్నాను. భయంకరమైన వాసన వేసింది.

అది విషమే! అందుకు సందేహంలేదు.

మాత్రతీసి జేబులో వేసుకున్నాను. జేమ్స్‌ని దొర్లించి,

వాడి ముహం కనపడకుండా గోడవైపుకి తిప్పాను. దూరంగావచ్చి పడుకున్నాను.

బాస్ తలపెట్టిన దుర్మార్గం నా కర్థమయింది.

అలాంటి నీచుడి దగ్గరకు తప్పించుకున్నాక వెళ్ళి లాభం లేదు. తన రహస్యాలు చెప్పేశానన్న భయంతో నన్ను రివాల్వరుతో కాల్చయినా చంపుతాడు.

ఇక్కడ్నుంచి తప్పించుకునే అవకాశం చిక్కితే నా దోవ నేను చూసుకోవాలనుకున్నాను. జేమ్స్‌కు ఆత్మశాంతి ప్రసాదించమని భగవంతుణ్ణి ప్రార్థించాను.

కళ్లుమూసుకుని పడుకున్నాను. కానీ నిద్రమాత్రం రావడంలేదు. బాగా చీకటిపడిపోయినట్లు, గదిలో వెలుగు తున్న లైటుకాంతి ఎక్కువయింది.

ముందురూంలోవున్న గోడగడియారం గంటలు కొట్టడం మొదలెట్టింది. లెఖ్ఖపెట్టాను. తొమ్మిదికొట్టి ఆగింది.

ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. తిన్నగా లాకప్‌రూం తలుపు ముందుకొచ్చి నిలబడ్డాడు.

"ఏయ్! ఖైదీ!" అన్నాడు.

నేను లేచి కూర్చున్నాను.

"ఆకలవుతుందా?" అడిగాడు.

అవుతుందన్నట్లు తలూపాను.

"నీకు అన్నం తెప్పిస్తాను. వెళ్ళి కాలకృత్యాలు ముగించుకురా!" అన్నాడు.

నేను చిన్నగా లేచి నిలబడ్డాను.

ఒక జవానొచ్చి తలుపులకున్న తాళం దీశాడు. నన్ను వెంటబెట్టుకునిపోయాడు. స్టేషనుకు వెనుక వేపునుంది లెట్రిన్, కాంపౌండ్ గోడనానుకుని. దాని వెనుక సముద్రం. చెవులు

చిల్లులు పడుతున్నాయి అది చేస్తున్న హోరుకు.

"అదే లెట్రిన్! వెళ్ళిరా! తప్పించుకునేందుకు ప్రయత్నించావా? మక్కెలిరగదంతాను. నేను ఇక్కడ కూర్చుని బీడీదమ్ము లాగుతుంటాను. సరేనా?" అన్నాడు.

"అలాగే!" అంటూ లెట్రిన్ లోకి వెళ్ళాను.

నేను వెలుపలికి వచ్చేప్పుడు గమనించాను. స్టేషన్ నిండా జనం వున్నారు. రెండు జీపులు, ఒక వ్యాన్, నాలుగు మోటారు సైకిళ్ళు వున్నాయి. కొంతమంది మఫ్టీలో వున్నారు. బహుశా అందరిదగ్గరా ఆయుధా లుండివుండాలనుకున్నాను.

వాళ్ళు నాకు తప్పించుకొనే అవకాశం కల్పించినా, ఏ పరిస్థితులలోను వాళ్ళ చెయ్యి దాటిపోయేందుకు వీలులేకుండా తగిన కట్టుదిట్టం చేసి పెట్టుకున్నారు.

లెట్రిన్ లో కూర్చున్నాను. బుర్ర పని చెయ్యడంలేదు. ఆ జవానును ఒకబీడి అడిగి పుచ్చుకోవలసిందనిపించింది.

రాత్రి రెండింటికి బాస్, అతని ముఠా జూహు బీచ్ దగ్గరున్న స్థావరానికి వస్తుంది. వాళ్ళు వచ్చేలోగా తను వెళ్ళాలి. అక్కడికి చేరేలోగా ఎక్సయిజ్ వాళ్ళను బురిడీ కొట్టించాలి. మోటార్ బోట్ పట్టుకుని సముద్రంమీద పడితే ఆ తర్వాత నన్ను దేముడుకూడా పట్టుకోలేడు. ధైర్యం కలిగింది.

పాంటు వేసుకుని, బటన్లు పెట్టుకున్నాను. గోడ ఎత్తు తక్కువగా వుండటంవల్ల, దూరంగా చెట్టుక్రింద రాయి మీద కూర్చుని బీడీదమ్ము కొడుతున్న జవాను కనుపించాడు.

తప్పించుకోనేందు కేమీ తొందరలేదు. పరుగెత్తవలసిన పనిలేదు. వాళ్ళు నా వెంటబడివచ్చేవాళ్లు తప్ప, నన్ను పట్టుకోనేవాళ్ళు కాదు.

నాకు నవ్వొచ్చింది.

అన్నంలేక ఆకలికి మాడిచస్తానని భయపడ్డాను పొద్దున్న. జేమ్స్ తెచ్చిన మాత్ర మింగి దిక్కులేని చావు చస్తాననుకొన్నాను, ఇంతకుముందు.

రెండూ తప్పిపోయాయి. ఖైదులోంచి తప్పుకునిపోయే అవకాశాన్ని ఖైదీకి వాళ్ళే ప్రసాదిస్తున్నారు, వాళ్ళస్వార్థం కోసం.

దాన్ని నాస్వార్థంకోసం వినియోగించ దలచుకొన్నాను. వెనుక వేపు గోడపైకి ఎక్కి దూకాను. సముద్రం ఒడ్డుకు పరుగెత్తాను.

దూరంగా తాజ్-షెరతాన్ హోటల్ కనిపిస్తుంది. అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా గేట్ వే ఆఫ్ ఇండియాదాకా వచ్చాను. మెట్లెక్కి పైకొచ్చి, సీ ఫ్యూకేఫ్ మీదుగా సిటీలో కడుగుబెట్టాను.

నాముందూ, వెనుకా, చుట్టూ ఎక్సైజ్ వాళ్ళున్నారు, మఫ్టీలోవున్నా వాళ్ళ మొహాన గవర్నమెంటు అధికార్లకున్న ముద్రలున్నాయి. వాటిని నాలాంటివాళ్ళు సులభంగా ఆనవాలు పట్టగలరు.

జేబులో తడుముకున్నాను. పదిరూపాయలనోటు కనుపించింది.

ఒక దుకాణం దగ్గర ఆగి నోటుమార్చి గోల్డ్ ఫ్లాక్ ఫిల్టర్ సిగరెట్లు కొన్నాను. ఒకటితీసి ముట్టించాను.

దమ్ములాగి వదులుతుంటే హాయిగావుంది. ఊపిరితిత్తులు యధాప్రకారం పనిచేస్తున్నాయి. వెనక్కి చూశాను. నా మొగుళ్ళు వెంటాడుతూనే వున్నారు. ఫ్లోరా ఫౌంటెన్ దాకా

నడిచాను. అక్కడ 'వెస్ట్' బస్సెక్కి దాదర్ రైల్వేస్టేషన్‌కు టిక్కెట్టు పుచ్చుకున్నాను.

మఫ్టీలోవున్న ఎక్సైజుమనిషి కూడా నాతో బస్సెక్కాడు. వెనుక వేపు గ్లాసుగుండా రోడ్ కేసి చూశాను. జీప్ వస్తూంది. రెండు మోటార్ సైకిల్స్ బస్ ప్రక్కనే వెళ్తున్నాయి.

సిగరెట్ ముట్టించాను.

కండక్టరొచ్చి బస్‌లో త్రాగొద్దన్నాడు.

గట్టిగా దమ్ములాగి కిటికీగుండా పారేసి "సారీ!" అన్నాను.

కండక్టరు వెళ్ళిపోయాడు.

దాదార్ రైల్వేస్టేషన్ ముందాగింది బస్. దిగాను. ఎడం వేపు దిగి ట్రాఫిక్ సర్కిల్‌లో కొచ్చాను. అరమైలు నడిచాను. గంట పదకొండయింది. ఎక్సైజు అధికారులు నన్ను వెంబడిస్తూనే ఉన్నారు.

లూనీయానా రెస్టారెంటులో దూరాను. ఇక్కడ్నుంచే వాళ్ళను నేను తప్పుకోవాలి.

నాకీ రెస్టారెంటు బాగా తెలుసు. దీని ఓనరుతో నాకు ఖాతా వుంది. రెండు బిజీరోడ్లను కలుపుతూ వుంటుంది విశాలమైన ఈ రెస్టారెంటు.

క్యాష్‌దగ్గరున్న జిలానీ నన్ను చూడగానే లేచి రాబోయాడు.

అతన్ని వద్దన్నట్లు కళ్ళతోనే వారించాను. అర్థంచేసుకుని ఆగిపోయాడు. వెళ్ళి కూర్చున్నాను టేబుల్ ముందు.

సర్వర్ వచ్చాడు. ఏం కావలసిందీ చెప్పాను. అతను వెళ్ళాడు. సిగరెట్ తీసి వెలిగించాను.

మనసులోనే నా ప్లాను సిద్ధం చేసుకున్నాను.

టాయిలెట్ రూంలోంచి వెలుపలికి ద్వారముంది. దాన్ని మామూలుగా స్కావెంజర్స్ వాడుతారు. లోపలవైపు బోల్టుంది. దాన్ని తెరచుకుని వెలుపలకుపోతే జిలానీ అంబాసిడర్ కారు పార్క్ చేసివుంటుంది. తాళాలెప్పుడూ దానికే వుంటాయి. ఆదివారంనాడు సరుకు తెచ్చి దాంట్లో పెట్టి, అక్కడుంచిన డబ్బుతీసుకొని వెళ్ళిపోవడం తన కలవాటు. తను గుమ్మందాటగానే జిలానీ కారెక్కి వెళ్తాడు.

ఈదినంగూడా అతను తన్ను చూశాక వెళ్ళి కారుతలుపు తెరచి డబ్బుపెట్టి ఉంటాడు. తాళాలు అలాగే వదిలేసి తిరిగొచ్చి క్యాష్‌లో కూర్చుంటాడు.

తను ఆ కారులో వెళ్ళిపోవాలి!

ఎక్సైజ్ అధికారులు ఐదుమందికిపైగానే వచ్చి అక్కడక్కడా సర్దుకొని కూర్చున్నారు నన్నుచూస్తూ. కౌంటర్ కు రెండువైపులా ఉంటారు వాళ్ళు.

కాళ్లో వెళ్ళినా వాళ్ళను తప్పించుకోవడం కష్టమే! కానీ తప్పదు. ఎలాగో ఒకలా వాళ్ళను బురిడీ కొట్టించాలి.

సర్వర్ ఆర్డర్ ప్రకారం అన్నీ తెచ్చిపెట్టాడు. కడుపునిండా తిన్నాను. రెండుకప్పుల టీ త్రాగాను. బిల్లు తెచ్చేందుకు వెళ్ళాడు సర్వరు.

నేను లేచి టాయిలెట్ రూంలోకి వెళ్ళాను. తలుపులు బిగించాను.

అవతలివేపు బోల్టు తెరచాను. ఎదురుగా అంబాసిడర్ కనుపించింది.

తలుపులు తీసున్నాయి. వెళ్ళికూర్చున్నాను. ఇగ్నిషన్ కీ వుంది. ముందుసీటు పైన చిన్న బ్రాండ్ కేస్ వుంది. లాకర్ నొక్కాను తెరుచుకుంది. నిండా వందరూపాయల కాగితా

లున్నాయి. అవన్నీ దొంగ నోట్లే!

బాండ్ కేస్ ప్రక్కనే ముస్లిం స్త్రీలు ధరించే నల్లటి పరదావుంది. సంతోషంతో నవ్వొచ్చింది. గబగబ తొడుక్కున్నాను. డోర్ మూసి ఇంజన్ స్టార్ట్ చేశాను. నన్నెవరూ గుర్తించలేరు. చూసినవాళ్ళు ఎవరో ముస్లింబీబీ వెళ్తుందనుకుంటారు.

కారున్న గేటులోగుండా వెలుపలికి దూకించాను.

వాచ్ మెన్ కు అది 'జిలానీ' కారని తెలుసు. లోనున్నది జిలానీ బేగం అనుకుని సెల్యూట్ చేశాడు. నేను గమనించనట్లే ఆక్సిలేటర్ పూర్తిగా నొక్కాను.

రాత్రివేళ కావడంతో రోడ్లు దాదాపు నిర్మానుష్యంగానే వున్నాయి.

హెడ్ లైట్లు ఆఫ్ చేసి వుంచాను.

నల్లటి తారు రోడ్ ను మింగుకుంటూ పోతూంది అంబాసిడర్. సైడ్ మిర్రర్ లోంచి వెనక వేపు కారేదైనా వస్తుందేమోనని చూశాను. అలాంటి జాడేమీ కనుపించలేదు.

రెస్టారెంటులో నా చుట్టూ కాపలాగా కూర్చున్న ఎక్సైజ్ వాళ్ళు గుర్తొచ్చారు. వాళ్ళ ప్లాను పటాపంచలయినందుకు సిగ్గుతో ఛస్తారు. దానికితోడు వాళ్ళు వదిలించుకోవలసిన శేష్మ్స్ శవంకూడా వుంది లాకప్ రూంలో.

రెస్టారెంటు వాచ్ మెన్ ని బహుశా ఎక్సైజ్ వాళ్ళు అడుగుతారు. అతను తన ప్రొప్రయిటర్ కారులో బేగం వెళ్ళిపోయిందని చెపుతాడు. దాంతో జిలానీని పట్టుకుంటారు.

అతను నిజం చెప్పడు. చెప్తే అతన్ని నేను ఇరికిస్తాననే భయం ఎటూ వుంటుంది.

కారు జూహూ వైపు ఉరుకుల్తో వెళ్ళసాగింది. నా దోవ

కెవ్వరూ అడ్డంలేదు. ఆనందంగావుంది.

జూహు బీచ్ రోడ్‌లోవున్న "ఆల్ నైట్ గ్రాసరీస్టోర్' ముందు కారాపాను.

కార్ను చూచి లోనుండి భాయ్ పరుగెత్తుకొచ్చాడు. పది వందరూపాయల కాగితాలిచ్చి, గొంతుమార్చి కావలసిన వస్తువులు చెప్పాను.

పదినిముషాల్లో తిరిగొచ్చాడు పాకెట్లతో. అన్నీ వెనక సీటులో సర్దమన్నాను. మిగిలిన చిల్లర ముప్ఫయి రూపాయల దాకావుంది. ఇవ్వబోయాడు. వద్దన్నాను. సెల్యూట్ చేశాడు వాడు.

కారు స్టార్టుచేశాను.

బోటు ప్రయాణం గాబట్టి, అందుకు అవసరమైన సామా నంతా కొన్నాను. సబ్బులు, విస్కీ సీసాలు, కేన్డ్ ఫుడ్, బ్రెడ్, సిగరెట్లు, అగ్గిపెట్టెలు. టార్చ్‌లైటు, సెల్సు, అన్నీ వున్నాయి. ఇంక కావలసిందల్లా మంచినీళ్ళు మాత్రమే.

మా గ్యాంగ్ వాడే మోటారు బోట్లలో డ్రమ్ములనిండా నీళ్ళు ఎప్పుడూ స్టాక్ చేసి పెడతారు. ఈ దినం వాళ్ళకు ప్రయాణం వుంది గాబట్టి ఖచ్చితంగా నీళ్ళు వుంటాయను కొన్నాను.

వాళ్ళ పథకం మార్చుకుని ముందేవచ్చి వుంటే నా ఆట కట్టినట్లే. ఎటు పోయేందుకు వీలుగాదు. పైగా వాళ్ళచేతుల్లో బడితే కాల్చి చంపడం ఖాయం.

అడుగడుగునా ఆపదలే ఎదురయ్యే అర్థంలేని జీవన మార్గాన్ని ఎన్నుకొన్నందుకు నాపై నాకే కోపం వచ్చింది.

ఏది ఏమయినా నేను మళ్ళీ ఖైదీగా చిక్కదలుచుకో లేదు. ఆ నాలుగు గోడలమధ్య, తిండీ తిప్పలు లేకుండా, వాళ్ళచేత తన్నులు తింటూ, వాళ్ళనే అడ్డమైన మాటలు

వింటూ బ్రతకటంకన్నా జేమ్స్ తనకిచ్చిన విషపు మాత్ర మ్రింగి చావడం మంచిదనుకున్నాను.

కారును అతికష్టంమీద ఇసుకలోకి డ్రైవ్ చేశాను. ఒక చోట ఆపాను.

కారుదిగి చుట్టూ చూశాను. ఎవ్వరూ వున్న అలికిడి వినిపించలేదు. అప్పుడప్పుడూ ప్రేమజంటలు తచ్చాడుతుంటారీ ప్రాంతంలో. బ్యాక్ డోర్ తెరచి కొన్న సామానంతా క్రిందపడించాను తలుపుమూసి. సామాను సర్ది భుజానికెత్తుకొని నడవడం మొదలెట్టాను.

గంట ఒకటయి వుంటుంది.

మరో గంటలో మా ముఠా అక్కడికొచ్చేస్తుంది. వాళ్లు రాకముందే నాపని పూర్తి చేసుకోవాలి.

ఈ పాటికి ఎక్సైజ్ వాళ్లుగూడా నా ఆచూకీ తెలుసుకుని వుండొచ్చు. వాళ్లుగూడా ఏ క్షణంలోనైనా ఇక్కడికి వచ్చే ప్రమాదముంది. ఆల్ నైట్ గ్రాసరీ స్టోరుదాకా వచ్చారంటే వాళ్లు నాజాడ కనుక్కోవడం సులభం.

నడక వేగం హెచ్చించాను.

దాదాపు మైలుదూరం నడిచాను. త్రోవలో ఎవ్వరూ తటస్థపడలేదు. మా మోటారు బోట్లుండే రహస్య స్థావరం అక్కడికో రెండు ఫర్లాంగులుంటుంది.

టార్చిలైటు వెలిగి ఆరిపోయింది. స్పష్టంగా చూశాను.

నా గుండెల్లో పెద్ద బండపడింది.

నాకన్నా ముందే ఎవరో వచ్చారన్నమాట. వాళ్లు ఖచ్చితంగా మా గ్యాంగ్ మనుషులే అయివుండాలి. నాకెటూ

తోచలేదు.

వెనక్కి పోతే ఎక్సైజ్ వాళ్లు పట్టుకుంటారు. ముందుకు వెళ్ళి ముఠావాళ్ళకు చిక్కి, నిర్దాక్షిణ్యంగా వాళ్ళచేత చంపబడటం నా కిష్టంలేదు.

అక్కడే నిలబడి సముద్రంకేసి చూశాను.

చిక్కటి చీకటి సముద్రంలో ప్రతిబింబిస్తూంది. అంతా పెద్ద నల్లటి తెరలాగుంది తప్ప నాకేం కనపడడంలేదు.

ఏది ఏమైనా ముందుకే వెళ్ళాలని తీర్మానించుకున్నాను.

ఒకరిద్దరు మనుషులైతే నేను సులభంగా వాళ్ళను తన్నగలను. నాకు అన్నిరకాల కుస్తీపట్లు తెలుసు. గ్యాంగ్‌లో చేరాక 'జూడో' కూడా నేర్పించారు. వాళ్ళదగ్గర ఆయుధాలుంటే మాత్రం నేను చెయ్యగలిగిందేమీ లేదు.

ముందుకు నడక సాగించాను.

మా స్థావరం దగ్గరవుతున్నకొద్దీ నా కళ్ళలో సత్తువ మాయమై నీరసం చోటు చేసుకుంటోంది. ధైర్యం సడలిపోయి అధైర్యం పెరుగుతూన్నట్లు తోచింది.

ఎవరో ఇద్దరు మనుషులు ఇసుకలోవున్న బోటును సముద్రంలోకి తోసేందుకు ప్రయత్నిస్తున్నారు. వాళ్లు మావాళ్లుకాదు.

నేను దగ్గరకు వెళ్ళాను.

"ఎవరు నువ్వు?" అడిగాడు ఒకతను.

"ఎందుకొచ్చావ్?" గర్జించాడు రెండోవాడు.

ఇద్దరూ బాగా బలంగా ఉన్నారు. వాళ్ళచేతుల్లో రివాల్వర్లున్నాయి.

"మీరెవరు?" అడిగాను నేను.

"నీ కనవసరం?"

"ఇంక ఐదునిమిషాల్లో మా గ్యాంగ్ మొత్తం వస్తుంది. మొత్తం నలభైమందిదాకా వున్నారు. వాళ్ళదగ్గర నాటు బాంబులున్నాయి. ఆటోమేటిక్ మెషిన్ గన్స్ వున్నాయి. తమ స్థావరంలో కడుగుబెట్టిన వాళ్ళను నిర్దాక్షిణ్యంగా చంపి పారేస్తారు! తెలుసా?" వాళ్ళను భయపెడితే నా ద్రోవకు అడ్డులేకుండా వెళ్ళిపోతారన్న ఆశతో చెప్పాను.

"రానీ! అందర్నీ పక్షుల్ని కాల్చినట్లు కాలుస్తాము" అన్నాడు నిర్భయంగా.

"సాహసించకండి! ప్రాణాలుపోతాయి" చెప్పాను.

"పోనీ! మేమొచ్చింది వజ్రాలకోసం. ఈ దినం పర్షియన్ సింధుశాఖనుండి పాసెంజరులైనరు వస్తుందట. దాంట్లో కోట్లు ఖరీదుచేసే వజ్రాలున్నాయి. వాట్ని మా గ్యాంగ్ అందుకొనేందుకు వస్తుందని మాకు సమాచారం వచ్చింది. మధ్యలోనే వాట్ని కాజేసేందుకు వచ్చాం!" అన్నారిద్దరూ.

"మీరెవరో చెప్పండి.వీలైతే నేనుగూడా మీకు సాయం చేస్తాను" అన్నాను.

"నిజంగానా?" అడిగారు వాళ్ళు.

"నిజంగానే! నన్ను ఎక్సైజ్ వాళ్లు పట్టుకున్నారు" అంటూ అప్పటిదాకా జరిగిందంతా క్లుప్తంగా చెప్పాను.

అంతా విన్నాక వాళ్ళకు నాపైన నమ్మకం కలిగింది.

"నువ్వు తెచ్చిన సామాన్లు బోట్లో పెట్టు!" ఆజ్ఞాపించారు.

అలాగే చేశాను.

"ఇదిగో రైఫిల్ తీసుకో!" స్పేర్‌గావున్న రైఫిల్ అందించారు.

"వీలైనంతవరకు మా గ్యాంగ్‌తో మేము తలపడం! వాళ్లు అనవసరంగా మా ద్రోవకు అడ్డంవస్తే కాల్చేస్తాం! నువ్వు కూడా వున్నావు గాబట్టి ఇంక భయంలేదు. మనం ముగ్గురం వాళ్ళను హతమార్చుద్దాం! ఆ వజ్రాల్లో నీకు నాలుగో వంతు ఇస్తాం!" అన్నారు.

"అలాగే!" అన్నాను.

బోట్‌ను సముద్రంలోకి నెట్టేందుకు ప్రారంభించాం. మామూలుగా పదిమంది కలసి పోరాడితేతప్ప అదికదలదు. మేము ముగ్గురం ఊగబెట్టి, దమ్ము తెచ్చుకుని శక్తినంతా కేంద్రీకరించి తోశాం. కదిలింది బోటు. మెల్లగా ఇసుక లోంచి నీళ్ళలోకి చేర్చాలి. సముద్రం అల్లకల్లోలంగావుంది. అలలు పెద్దగాలేచి పడుతున్నాయి.

ముగ్గురం బోటెక్కాం.

ఒకతను డ్రైవింగ్ వీల్ దగ్గర చేరాడు. కంపాస్ తీసి చూశాడు. ఎనభై ఆరు డిగ్రీలకు సర్ది పెట్టాడు.

"మనం మూడుమైళ్ళు వెళ్ళాలి!" అన్నాడతను.

"అంతేనా?" రెండో అతను నన్నడిగాడు.

"దాదాపుగా అంతే దూరం వుంటుంది" అన్నాను.

సముద్రపు ఒడ్డున కలకలం బయలుదేరింది. చీకట్లో అటూ ఇటూ తచ్చాడుతూ ఆకారాలు కనుపించాయి.

"మన బోట్ దొంగిలించారెవరో?" అరిచారు ఒకరు.

సముద్రం పైకి టార్చీ వేశారు. మా బోటు దాదాపు ఫర్లాంగు దూరంలో వుంది. అయినా టార్చివెలుగు మాదాకా వచ్చింది.

"వాళ్ళొచ్చేశారు?" చెప్పాను.

"రానీ! ఫరవాలేదు. బోట్ స్లో చెయ్యి. సముద్రంమీద నే వాళ్ళ అంతు తేల్చుకుందాం. మనం షిప్ దగ్గరకు బోయే లోగా వీళ్ళను మట్టుబెట్టాలి!" చెప్పాడు ఇంజన్ దగ్గరున్న వ్యక్తి.

"దట్స్ గుడ్!" రెండో వ్యక్తి మొదటి వ్యక్తిని సమర్థించాడు.

"వాళ్ళదగ్గర మెషిన్‌గన్స్ వున్నాయి. బోట్‌లో దాదాపు పదిహేనుమందిదాకా వస్తారు. మనం బ్రతికి బయట పడగలమా?" అన్నాను అనుమానంగా.

"అలా బెంబేలుపడకు! ధైర్యంగా వుండు. మే మిద్దరం షూటింగ్‌లో ఎక్స్‌పర్టులం. మా తడాఖా చూపిస్తాం!" అన్నా రిద్దరూ ఒకేసారి.

వాళ్ళతోడు దొరికినందుకూ, మా గ్యాంగ్‌కన్నా నేను సముద్రంలో ముందున్నందుకూ, ఆనందంగా వుంది.

ఖైదీగా చావడంకన్నా, స్వేచ్ఛాజీవిగా అనంతమైన సముద్రంమీద ప్రాణాలకోసం పోరాడుతూ చావడం మెరుగనిపించింది. రైఫిల్ తీసి అమ్మ్యునిషన్ నింపుకొన్నాను.

మా గ్యాంగ్ బోటు సర్రుమంటూ నీళ్ళను చీల్చుకుంటూ, అలలను తప్పుకుంటూ మావైపు రావడం గమనించాను.

చెవులు చిల్లులుపడేలా 'ఢా'మ్మని మ్రోగింది మెషిన్‌గన్

దూరంగా. బుల్లెట్ మా బోట్ ముందుదాకా దూసుకొచ్చి నీళ్ళలో పడింది.

"మిస్టర్ జాన్!" అన్నాడొకతను.

"యస్!" అన్నాను.

"నువ్వు వీల్ దగ్గరుండు. యుద్ధం మేంచేస్తాం. మనం బహుశా వాళ్ళ షూటింగ్ రేంజ్‌లో వున్నట్టున్నాం. ఇంకాస్త స్పీడు పెంచు!" ఆదేశించాడు.

నేను వీల్ వద్దకు వెళ్ళిపోయాను.

అతను బోటు పైకెక్కాడు.

(ఇంకా వుంది)